చెళ్ళూరి సీతారాజేశ్వరరావు



# నవ్వే-నిజమైంది

ధనమ్మ పేరుకుతగ్గ యిల్లాలు అక్ష రాభ్యాసం రోజున పుస్తకాలు ముట్టు కోలేదు. డబ్బుని పట్టుకుంది. ధనమ్మ కామ్మ 'జమీందార్ పెళ్ళాం అవుతుం దని' జోస్యం చెప్పేసింది. కాని ధనమ్మ వెంకటనర్సయ్య భార్యయింది. వెంకటనర్సయ్యకి కూలిపోయే కొంప, రెండెకరాలు పొలంమాత్రం, ఉంది. ధనమ్మ నిరాశపడలేదు. సంతోషించింది.

ఎందుకంటే వెంకటనర్సయ్య మంచి మొగుడు. అన్ని పవర్సూ ధనమ్మ కిచ్చేసి తాను చదరంగంబిల్ల పుచ్చుకుని కూర్చున్నాడు. ధనమ్మ కిదే కావాలి. మొగుడ్ని చాటుచేసుకుని చక్రం తిప్పింది. పిడక లమ్మింది. పాలు అమ్మింది. ధనాన్ని పోగేసి రెండెకరాల ప్రక్క సున్న చుట్టింది.

"మా ధనం ఉంది చూశారూ ..."

వెంకటనర్సయ్య పొగడ్డం, ఆరాధించడం నేర్చుకున్నాడు. పిల్లలకి కూడ తల్లి ప్రాముఖ్యమే కనిపించింది.

ఓ సుప్రభాతాన వెంకటనర్సయ్య వేపచెట్టు క్రింద ముఖం కడుగుతూంటే 'దండాలండి' సీతయ్య దగ్గరకి వచ్చాడు. ఉత్సవ విగ్రహాలకి కూడ ఆరాధన జరుగుతుందని వెంకటనర్సయ్యకి తెలుసు. "అమ్మగారు లోపలుంది..." అన్నాడు.

సీతయ్య పెరటివైపుకి వెళ్ళాడు.

అక్కడ పదిమంది పైగా జనమున్నారు. ధనమ్మ పాలు, పెరుగు అమ్మకంలో ఉంది. సీతయ్యని చూసి పలకరింపుగా నవ్వింది. జనం వెళ్ళేదాకా సీతయ్య ప్రక్కనే కూర్చున్నాడు. ధనమ్మ ఖాళీ గిన్నెలు దాసీదానికి పడేసి "కాఫీ త్రాగుతావా సీతయ్యా ... ఏమిటో నీకు ముఖమాటం. ఎప్పుడూ ఏం తాగవు" అంది దగ్గరకి వచ్చి.

ఆమె తత్వం తెలుసు గనుక సీతయ్య నవ్వి ఊరుకున్నాడు.

"మామిడిచెట్లు అడిగావు ... మళ్ళీ కనిపించలేదు. చెట్లు అమ్మమని బేరగాళ్ళు వస్తున్నారు. ఊర్లోవాడివి నిన్నడిగి యిద్దామని ఆగాను..."

ఓ వారం క్రితం సీతయ్య వచ్చి చెట్లు చూసుకున్నాడు. ధర ధనమ్మకి నచ్చలేదు. తర్వాత చెబుతానని మిగతా బేరగాళ్ళని పిలిచింది. వాళ్ళు సీతయ్య కంటె తక్కువ చెప్పారు. దాంతో ధనమ్మ ప్లేటు ఫిరాయించింది.

"మీలాంటి దయగల తల్లులని నమ్ముకునే ఏదో సంసారం ఈడ్చుకొస్తున్నా నమ్మగారూ. నామీద మీ కాభిమానముంది." సీతయ్య పొగిడాడు.

ధనమ్మకి పొగడ్త లక్కర్లేదు. "మొన్నటి ధరకి కోసుకు పో."

సీతయ్య పెరటివైపున ఉన్న మామిడిచెట్లని చూసి వచ్చాడు. "అలాగే అమ్మగారూ !"

"ఇవాళ నువ్వు కోసుకుపోవాలి. మేం పెళ్ళికి వెళుతున్నాం. ఎవరన్నా తెంపుకుపోతే బాధపడతావు"

"ఇవాళ సంతకూడా నండి. ఇప్పుడే వచ్చి కోసేస్తాను."

సీతయ్యకి యాభై యేళ్ళుంటాయి. చిన్నప్పట్నుంచి కాయగూరల వ్యాపారమే చేస్తున్నాడు. సంసారం పెద్దది కావడంతో ఎప్పుడూ కరువుగానే ఉంటుంది.

సీతయ్య రెండయ్యేసరికి కాయలు కోయడం పూర్తిచేశాడు. రాసులు క్రిందపోశాడు.

"అమ్మగారూ చూస్తూండండి బండి తోలుకు వస్తాను." అని చెప్పి వెళ్లాడు.

రాసులు చూడగానే ధనమ్మకి కన్నుకుట్టింది. తను చవుకగా యిచ్చేసింది. సీతయ్యకి వచ్చే లాభాన్ని అంచనా వేసుకుంది ఆమె గుండె లదిరాయి.

ఇప్పుడు రేటు ఎక్కువ చేయమనడం బాగోదు. ఏంచేయాలో ధనమ్మ వేగిరం ఆలోచించింది. పెద్దగంప తీసుకువచ్చి కాయలు యింట్లో పోసుకుంది.

కంగారుగా యిలా రెండుసార్లు చేసింది.

టీకోసం వచ్చిన వెంకటనర్సయ్య "నువ్వే మోస్తున్నావేమిటీ కాయలు ... పాలేరు వీధిలో ఉన్నాడు కదా !" అన్నాడు భార్య కష్టపడిపోతోందని.

"మీరు నోర్మూసుకోండి," ధనమ్మ కసిరిపడేసింది.

ఆ మానవు డింక మాట్లాడలేదు.

సీతయ్య బండి తెచ్చి కాయలు ఎగుమతి చేసుకుంటున్నాడు. గుర్తించాడేమోనని ధనమ్మ వసారాలోనుంచి తొంగిచూస్తోంది.

సీతయ్య కాయలు వెయ్యడం ఆపి వంటింటి దగ్గర కొచ్చాడు, "అమ్మగారూ !" అంటూ.

తను కాయలు తీయటం చూశాడేమో, ధనమ్మ వణికిపోయింది. ఏదో పని ఉన్నట్టు కాస్సేపు రాలేదు.

సీతయ్యకి మాట్లాడడానికి అవకాశం యియ్యకుండా "డబ్బు నువ్వు యిప్పుడు యిచ్చెయ్యాలి, ఏదో వస్తుందనుకున్నాం, అది రాలేదు." వేగిరం చెప్పింది.

"సంత చెయ్యకుండా ఎలా వస్తుందమ్మా?" దీనంగా అన్నాడు.

"మీరంతా అంతేరా ... ఇంతకీ ఎందుకు పిలిచావు ?"

"మామిడికాయలు..."

"నేను చూస్తూనే ఉన్నాను. ఎవరూ తియ్యలేదు. నువ్వొత్త అనుమానం మనిషివి."

"అదికాదమ్మగారూ. రాశిదగ్గర గొలుసుపడి ఉంది మీది ... " అంటూ తీసి అరుగుమీద పెట్టాడు. కంగారులో యిందాక జారిపోయి ఉంటుందనుకుంది.

డబ్బుకోసం కలవరించే ధనమ్మకి వాడి నిజాయితీకి మతిపోయింది.

